సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 19 । మే । 2023



పోస్టాఫీస్‌ల్లో మళ్లీ ఆధార్
ఆధార్ కార్డుల జారీ తదితర సేవలు పోస్టాఫీస్‌ల్లో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా మళ్లీ అందుబాటులోకి వస్తున్నాయి. 10లో



కంచుకోట అని నిరూపిద్దాం
ఖమ్మం కాంగ్రెస్‌కు కంచుకోట అని నిరూపించేలా భట్టి పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు. 10లో



వాతావరణం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

'సాక్షి' ఆధ్వర్యంలో పోటీలు

- రేపటి నుంచి మూడు రోజుల పాటు..

ఖమ్మం సహకారనగర్: సాక్షి మీడియా, రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ కాలనీ ఆధ్వర్యాన వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈ నెల 20, 21, 22వ తేదీల్లో చదరంగం, చిత్రలేఖనం, కరాటే పోటీలు ఉంటాయి. ఖమ్మం శ్రీనగర్ కాలనీ రోడ్డు నంబర్ 9లోని రెజొనెన్స్ స్కూల్‌లో నిర్ణీత తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు పోటీలు నిర్వహిస్తారు. ఈనెల 20న 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు చదరంగం, 21న 5, 6, 7వ తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం, 22న 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు కరాటే పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎవరి సామగ్రి వారే తెచ్చుకోవాల్సి ఉంటుంది. వివరాలు, పేర్ల నమోదు కోసం 87123 44800, 88866 62271 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

చేపల చెరువులు, ఉపాధి పనుల పరిశీలన



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ రాధిక

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో అసిస్టెంట్ కలెక్టర్ రాధికగుప్తా గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బూడిదంపాడు, రఘునాథపాలెం పంచాయతీల్లో చేపల చెరువులను పరిశీలించారు. అలాగే, ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు పరిశీలించి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఆతర్వాత నర్సరీల నిర్వహణపై ఆరా తీసిన ఆమె ఎండాకాలంలో మొక్కల సంరక్షణకు జాగ్రత్తలు వహించాలని సూచించారు. డీఆర్డీఓ విద్యాచందన, అడిషనల్ డీఆర్డీఓ శిరీష, ఏపీడీ చుంచు శ్రీనివాసరావు, ఎంపీడీఓ రామకృష్ణతో పాటు పద్మయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.


పాత కలెక్టరేట్‌లోని పోస్టాఫీస్ జెడ్పీలోకి..

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం పాత కలెక్టర్‌లోని పోస్టాఫీస్‌ను పక్కనే ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయంలోకి మార్చారు. కలెక్టర్ కార్యాలయం ఇప్పటికే రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో నిర్మించిన నూతన కలెక్టరేట్‌లోకి మార్చగా, పాత కలెక్టరేట్ భవనాన్ని ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించారు. దీంతో ఇక్కడ కొనసాగుతున్న పోస్టాఫీస్‌ను పక్కనే ఉన్న జెడ్పీ కార్యాలయంలోకి మార్చారు. ఇదిలా ఉండగా వీ.వీ.పాలెంలోని పోస్టాఫీస్‌ను కలెక్టరేట్‌లోకి మార్చగా.. ఈ రెండు పోస్టాఫీసుల్లో తపాలా శాఖ అందించే అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు

చింతకాని: మండలంలోని చింతకాని, ప్రొద్దుటూరు, నాగిలిగొండల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ డీఎం సునీత, జిల్లా సహకార అధికారి విజయకుమారి గురువారం పరిశీలించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో సమస్యలపై రైతులను ఆరా తీయగా వారు చెప్పిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సహకార, వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చింతకాని సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

టీ హబ్‌కు ఎన్ఏబీఎల్ గుర్తింపు



ఖమ్మం పెద్దాస్పత్రిలోని టీ హబ్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జనరల్ ఆస్పత్రి ఆవరణలోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబరోటరీస్ నుండి సర్టిఫికెట్ ప్రకటించారు. నాణ్యత, కచ్చితమైన ఫలితాలతో పాటు ఎక్కువ పరీక్షలు నిర్వహిస్తుండడాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ సర్టిఫికెట్ జారీ చేశారు. జాతీయ స్థాయిలో పేరుగాంచిన డయాగ్నస్టిక్ సెంటర్లకు మాత్రమే జారీ అయ్యే సర్టిఫికెట్ ఖమ్మం హబ్‌కు రావడంపై మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు టీ హబ్ ఉద్యోగులను అభినందించారు.

నిండుగా చెరువులు!



మండు వేసవిలోనూ జలకళ

- పాలేరు నియోజకవర్గంలో మత్తడి పోస్తున్న చెరువులు
- 551 చెరువులకు జలకళ.. పాక్షికంగా నిండినవి 318
- వచ్చే ఖరీఫ్‌కు ఢోకా లేనట్లేనని ఆయకట్టు రైతుల ధీమా

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మండుతున్న ఎండల్లోనూ జిల్లాలోని చెరువుల్లో జలకళ ఉట్టిపడుతోంది. వేసవిలో చెరువులు ఎండిపోవడం సహజం. కానీ ఈసారి జిల్లాలో అత్యధికశాతం చెరువులు నిండుకుండల్లా కళకళలాడుతున్నాయి. ప్రధానంగా పాలేరు నియోజకవర్గంలోని కొన్ని చెరువులు మత్తడి పోస్తుండటం విశేషం. జిల్లాలోని దాదాపు 78 శాతం చెరువుల్లో నీరు ఉన్నట్లు నీటిపారుదల శాఖ అధికారుల లెక్కలు చెబుతుండగా... వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సాగు పనులు సకాలంలో మొదలుపెట్టవచ్చని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల మరమ్మతులతో..

తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించింది. రైతులకు సాగు నీటి అవసరాలకు గ్రామాల్లో చెరువులే ప్రధాన వనరులు కావడంతో మిషన్ కాకతీయ పేరిట మరమ్మతులు చేయించారు. చెరువులకు కట్టల నిర్మాణం, పూడిక తీయించడం, పిచ్చిచెట్ల తొలగింపునకు తోడు కాల్వలు తవ్వించి ఇతర చిన్న చిన్న మరమ్మతులు చేపట్టారు. దీంతో వర్షపు నీరు చెరువుల్లో నిలుస్తుండగా, ఆయకట్టుకు నీటి లభ్యత పెరిగింది. గతంలో పేరుకు మాత్రమే ఉన్న చెరువులు నేడు నీటితో నిండుకుండల్లా మారాయి. ఇక ఇటీవల ఉపరితల ఆవర్తనం కారణంగా కురిసిన వర్షాలతో దాదాపు చెరువులన్నీ నిండాయి.

వేల ఎకరాలకు ఆధారం..

జిల్లాలోని వేల ఎకరాల సాగుకు చెరువులే ఆధారంగా ఉన్నాయి. వంద ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న చెరువులు జిల్లాలో 244 ఉండగా, 100 ఎకరాలలోపు ఆయకట్టుకు నీరు అందించే చెరువులు 1,165 ఉన్నాయి. మొత్తంగా 1,409 చెరువులకు గాను దాదాపు అన్నింట్లో సరిపడా నీరు ఉండడంతో వచ్చే ఖరీఫ్‌లో వర్షాలు ఆలస్యమైనా రైతులు నీటి కోసం వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు.

పొంగి పొర్లుతున్న చెరువులు

జిల్లాలో 14 చెరువులు మత్తడి పోస్తున్నాయి. వీటిలో పాలేరు నియోజకవర్గం పరిధిలోనే 13 చెరువులు ఉండటం విశేషం. పాలేరు రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతుండడమే దీనికి కారణమని చెబుతున్నారు. ఇందులో వంద ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న చెరువులు మూడు ఉండగా.. వంద ఎకరాలలోపు చెరువులు పది ఉన్నాయి. అత్యధికంగా సత్తుపల్లి నియోజకవర్గంలో 331, మధిర నియోజకవర్గంలో 126 చెరువులే కాక వైరా నియోజకవర్గంలోని ఓ చెరువుకు జలకళ ఉట్టి పడుతోంది. మొత్తంగా 551 చెరువులు పూర్తిగా నిండగా ఇందులో 150 చెరువులు 100 ఎకరాలకు పైగా ఆయకట్టుకు నీరు ఇచ్చేవి, 401 చెరువులు 100 ఎకరాలలోపు ఆయకట్టుకు నీరు అందించేవి ఉన్నాయి.

జిల్లాలో మొత్తం చెరువులు	1,409
100 శాతం పైగా నిండిన చెరువు	14
75-100 శాతం నిండినవి	551
50 -75 శాతం నిండినవి	310
25-50 శాతం నిండినవి	216
0-25 శాతం నిండినవి	318

318 చెరువుల్లో అంతంతే..

ఇక 318 చెరువుల్లో అంతంత మాత్రంగానే నీరు చేరింది. ఇందులో వైరా నియోజకవర్గంలోని 390 చెరువులకు గాను 193, ఖమ్మం నియోజకవర్గంలోని 112 చెరువులకు గాను 109 చెరువుల్లో నీరు 25 శాతంలోపు ఉంది. ఉంది. పాలేరు నియోజకవర్గంలో కూడా 16 చెరువుల్లో నీరు తక్కువగా ఉన్నప్పటికీ వానాకాలం సీజన్‌కల్లా ఇవి సైతం నిండుతాయనే ఆశాభావంతో రైతులు ఉన్నారు.

600 ఎకరాలు.. రెండు పంటలు

నేలకొండపల్లిలోని బాలసముద్రం చెరువు నిండుకుండలా మారింది. ఈ చెరువు కింద గువ్వలగూడెం, సదాశివపురం, ముజ్జుగూడెం, అనాసాగరం, పాత కొత్తూరు, నేలకొండపల్లి గ్రామాల్లో 600 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో చెరువు పెద్ద తూము నాలుగు కిలోమీటర్లు ఉండగా 250 ఎకరాల ఆయకట్టు. నక్కల తూము రెండు కిలోమీటర్లకు 175 ఎకరాలు, శివాలయం తూము నాలుగు కిలోమీటర్లు పరిధిలో 175 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువు నీటి నిల్వ సామర్థ్యం 60 ఎంసీఎఫ్(మిలియన్ క్యూబిక్ ఫీట్) కాగా.. ప్రస్తుతం 58 ఎంసీఎఫ్‌ల నీరు ఉంది. గత ఏడాది, అంతకుముందు ఈ చెరువులో 40 నుంచి 45 ఎంసీఎఫ్ నీరు మాత్రమే ఉండటంతో ఒకే పంట పండించేవారు. కానీ ఈసారి రెండు పంటలు పండుతాయని రైతులు చెబుతున్నారు.

రెండు పంటలకు సిద్ధమవుతున్నా..



బాలసముద్రం చెరువు కింద నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. ఏటా ఒక పంటగా వరి సాగు చేస్తాను. కానీ ఈసారి నీరు పుష్కలంగా ఉండడంతో సంతోషమేస్తోంది. వానాకాలం, యాసంగిలో పంటలు సాగు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నా.

– నున్నా లక్ష్మణ్, రైతు, అనాసాగరం, నేలకొండపల్లి మండలం

ఎండ.. వడగాలులు

- ఏ మాత్రం తగ్గని ఉష్ణోగ్రత
- నేలకొండపల్లిలో అత్యధికంగా నమోదు

ఖమ్మంవ్యవసాయం: ఎండలు ఏ మాత్రం తగ్గకపోగా వడగాలులు, ఉక్కపోతతో ప్రజలు అతలాకుతలమవుతున్నారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనగా గురువారం కూడా జిల్లా అంతటా గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలై పది గంటలకల్లా పతాక స్థాయికి చేరుతోంది. ఇక మధ్యాహ్నం ఎండ తీవ్రతకు తోడు వడగాలులు వీస్తుండడంతో జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. పనులు చేసే పరిస్థితి లేకపోవడంతో రెక్కాడితే కానీ డొక్కాడని కార్మికుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. కాగా, గురువారం జిల్లావ్యాప్తంగా 40 నుంచి డిగ్రీల నడుమ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, అత్యధికంగా నేలకొండపల్లి మండల కేంద్రంలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం.

జిల్లాలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెంటీగ్రేడ్‌లో)

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రత
నేలకొండపల్లి	నేలకొండపల్లి	45.1
ముదిగొండ	పమ్మి, బాణాపురం	44.8
కూసుమంచి	కూసుమంచి	43.8
చింతకాని	చింతకాని	42.8
ముదిగొండ	ముదిగొండ	42.3
తిరుమలాయపాలెం	తిరుమలాయపాలెం	42.2
కామేపల్లి	లింగాల	42.1



22నుంచి జిల్లాస్థాయి సీఎం కప్

- క్రీడాపోటీల షెడ్యూల్ ఖరారు
- మూడు రోజుల పాటు పోటీల నిర్వహణకు కార్యాచరణ

ఖమ్మం స్పోర్ట్స్: జిలాస్థాయిలో జరిగే సీఎం కప్ క్రీడా పోటీలకు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడా జట్లు నేరుగా జిల్లాస్థాయిలో పాల్గొననుండగా, అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్, షూటింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ అంశాల్లో మాత్రం జిల్లా జట్లుకు ఎంపిక పోటీలు జరుగుతాయి. ఈమేరకు క్రీడాకారులు ఈనెల 21వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. కాగా, ఈనెల 22న ఉదయం 7గంటలకు కబడ్డీ, వాలీబాల్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ పోటీలు, 23న అథ్లెటిక్స్ (100, 400, లాంగ్‌జంప్, షాట్‌పుట్), ఖోఖో, బాక్సింగ్, రెజ్లింగ్, షూటింగ్ పోటీలు, ఈనెల 24వ తేదీన టేబుల్ టెన్నిస్, హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, లాన్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్ క్రీడాంశాల్లో పోటీలు, ఎంపికలు జరుగుతాయి. ఇక బాస్కెట్‌బాల్ పోటీలు మాత్రం మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. కాగా, 15నుంచి 36 ఏళ్ల వయస్సు కలిగిన పురుషులు, మహిళలు వయస్సు ధృవీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు తీసుకురావాలని, జిల్లా స్థాయిలో విజేతలను ఈనెల 28నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. పూర్తి వివరాల కోసం డీవైఎస్ఓ కార్యాలయంలో కానీ వాలీబాల్ కోచ్ ఎం.డీ.అక్బర్ అలీ(98483 55350)ని కానీ సంప్రదించాలని అధికారులు సూచించారు.



మండల స్థాయి పోటీల సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు (ఫైల్)

మండల స్థాయిలో 6వేలకు పైగా హాజరు

మండల స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలు విజయవంతమయ్యాయని అధికారులు ప్రకటించారు. ఐదు క్రీడాంశాల్లో నిర్వహించిన పోటీలకు పురుషులు 5,014మంది, మహిళలు 1,152 మంది హాజరయ్యారని తెలిపారు. బోనకల్, చింతకాని, ఏన్కూర్, కల్లూరు, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, సతుపల్లి మండలాల నుంచి ఎండలను లెక్క చేయకుండా ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొన్నారని వెల్లడించారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు

ఖమ్మం సహకారనగర్: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ స్నేహలత సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. పర్యావరణానికి హాని కలిగే చర్యలను అరికట్టేలా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఇందుకోసం రూపొందించిన మిషన్‌లైన్‌ను పకడ్బందీగా అమలుచేయాలని చెప్పారు. ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ బి.రవీందర్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి అనసూయ, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు జ్యోతి, సత్యనారాయణ, మైనింగ్ ఏడీ సంజయ్, పరిశ్రమల శాఖ జీఎం అజయ్‌కుమార్, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ సుజాత, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, డిప్యూటీ డీఎంహెచ్ఓ రాంబాబు పాల్గొన్నారు.

చేపల వంటలతో విందు!



చేపలతో సిద్ధం చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలు, పచ్చళ్లు

- వచ్చేనెల ఖమ్మం, కొత్తగూడెంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, మృగశిర కార్తె సందర్భంగా ఏర్పాటు
- ఇప్పటికే రెండు జిల్లాలకు చెందిన పలువురు మత్స్యకార మహిళకు శిక్షణ

ఖమ్మంవ్యవసాయం: ఫిష్ బర్గర్, ఫిష్ సమోసా, ఫిష్ పకోడి, ఫిష్ బిర్యానీ, ఫిష్ సూప్స్, ఫిష్ కట్‌లెట్, స్మోకెడ్ ఫిష్, ప్రాన్స్ బట్టర్ ఫ్రై, ప్రాన్స్ పకోడి... ఈ పేర్లు ఎప్పుడైనా విన్నారా?! ఒకవేళ విన్నా రుచి చూశారా? రుచి చూడాలని అనుకుంటే మాత్రం రెడీగా ఉండండి! వచ్చే నెల 8నుంచి మూడు రోజుల పాటు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, మృగశిర కార్తె సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లో కేవలం చేపల వంటకాలతో స్టాళ్లు ఏర్పాటుచేయనున్నారు. ఇన్నాళ్లు చేపల పులుసు, ఫ్రై, పచ్చళ్ల రుచి మాత్రమే చూసిన ఉమ్మడి జిల్లా వాసులకు రుచికరమైన వంటకాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా ఇప్పటికే ప్రత్యేక శిక్షణ పొందిన మహిళల ఆధ్వర్యాన ఈ 'ఫిష్ ఫుడ్ ఫెస్టివల్' జరగనుంది.

ఉమ్మడి జిల్లాలో పుష్కలంగా వనరులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పుష్కలంగా జల వనరులు ఉండగా చేపల పెంపకం, వేటతో వేలాది మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ప్రాజెక్టుల నిర్మాణం, వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో దాదాపు అన్ని జలాశయాలు అన్ని కాలా ల్లో నిండా నీటితో కళకళలాడుతున్నాయి. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లలతో మత్స్య సంపద పెరిగింది. ఖమ్మం జిల్లాలోని 1,100 జలాశయాల్లో 194 మత్స్య సహకార సంఘాలకు చెందిన 15,220 మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. వీరిలో 19 మహిళా మత్స్య సహకార సంఘాలు, ఏడు గిరిజన మత్స్య సహకార సంఘాలు కూడా ఉన్నాయి. ఇక భద్రాద్రి జిల్లాలో మొత్తం 763 జలాశయాలు ఉండగా, వీటి ఆధారంగా 60 మత్స్యకార సహకార సంఘాలు నాలుగు వేల మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ఈమేరకు భద్రాద్రి జిల్లా ఇల్లెందు, రొంపేడు గ్రామానికి చెందిన 15 మంది మత్స్యకార మహిళలతో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు హైదరాబాద్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ అండ్ మేనేజ్‌మెంట్ వారు చేపలతో వంట పదార్థాల తయారీపై ఇచ్చిన శిక్షణలో పాల్గొన్నారు. అంతేకాక గిరిజన మత్స్యకార సంఘాల మహిళలు విశాఖపట్నంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆక్వా కల్చర్‌పై నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ తీసుకున్నారు.



చేపలను కోసే విధానంపై శిక్షణ ఇస్తున్న నిపుణులు



చేపల వంటల తయారీలో శిక్షణ పొందుతున్న మహిళలు

పసందైన రుచులు, సాంస్కృతిక కార్యక్రమాలు

చేపల వంటకాల తయారీలో శిక్షణ పొందిన మహిళల ఆధ్వర్యాన ఖమ్మంలోని పీజీ కళాశాల, కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో మూడు రోజుల పాటు ఫిష్ ఫుడ్ ఫుస్టివల్ నిర్వహిస్తారు. అయితే, ఖమ్మంలో ఇంకా వేదిక ఖరారు కావాల్సి ఉంది. ఈమేరకు ఇరవైకి పైగా వంటకాలను ప్రదర్శించనున్నారని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మత్స్యశాఖాధికారులు ఆంజనేయస్వామి, బి.వీరన్న తెలిపారు. స్టాళ్లలో చేపల పచ్చళ్లు, చేపలతో చేసే బర్గర్, సమోసా, పకోడి, బిర్యానీ, మంచూరియా, సూప్స్, కట్‌లెట్, స్మోక్ట్ ఫిష్, ఫ్రైడ్ ప్రాన్స్, బాల్స్ వంటివి చేపల ప్రియులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేలా సన్నాహాలు జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు సాయంత్రం జరిగే ఫుడ్ ఫెస్టివల్‌కు తోడు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా కళాకారులతో ప్రదర్శనలు కూడా ఉంటాయి.

మహిళలతో వలల ప్రదర్శన

పాలేరు రిజర్వాయర్ ఆధారంగా రూపుదిద్దుకున్న నాయకన్‌గూడెంకు చెందిన మహిళా మత్స్య సహకార సంఘం సభ్యులతో చేపలు పట్టే వలల ప్రదర్శన కూడా ఏర్పాటుచేయాలని అధికారులు నిర్ణయించారు. నాయకన్‌గూడెం మత్స్య సహకార సంఘం మహిళలు వలల తయారీలో నిపుణులు కాగా, ప్రత్యేక శిక్షణ కూడా పొందారు. వీరు రెండు, మూడు, నాలుగు కన్నుల వలలే కాక రొయ్యలను పట్టే వలలనూ తయారు చేస్తారు.

చేపల పండుగ ప్రత్యేకతను చాటుతాం



తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఖమ్మంలో ఘనంగా నిర్వహించనున్నాం. శిక్షణ పొందిన మహిళా మత్స్యకారులతో ఈ పండుగ జరుపుతాం. చేపల ప్రియులకు మూడు రోజుల పాటు నోరూరించే రుచులతో భిన్నమైన వంటలను అందుబాటులో తీసుకొస్తాం.

– ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

భిన్నమైన వంటకాల రుచి చూపిస్తాం



ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లోభాగంగా భిన్నమైన చేపల వంటకాలను ప్రదర్శనతో పాటు చేపల ప్రియులకు రుచి చూపిస్తాం. వివిధ రకాల చేపల పచ్చళ్లు, ఫిష్ పకోడీ, ఫిష్ బిర్యానీ, ప్రాన్స్ బిర్యానీ వంటి రుచులను అందుబాటులోకి తీసుకురానున్నాం. మత్స్యశాఖ ద్వారా ఇప్పటికే హైదరాబాద్‌లో శిక్షణ పొందాం.

– లింగాల వాణి, కల్లూరు

వేగంగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు

- రైతులకు ఇబ్బంది ఎదురుకాకుండా చర్యలు
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో మరింత వేగం పెంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 186 కేంద్రాల ద్వారా 9,743 మంది రైతుల నుండి 90,651.680 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, 84,667.440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించామన్నారు. అంతేకాకుండా ఇప్పటి వరకు 1,633 మంది రైతులకు రూ.19,88,55,128 వారి ఖాతాల్లో జమచేశామన్నారు. ఇక ఇప్పటివరకు 31 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా 11 కేంద్రాల్లో 751 మంది రైతుల నుండి 4,623.903 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశామని తెలిపారు. కాగా, గన్నీ బ్యాగులు, వాహనాలు సమకూర్చుకుంటూ కొనుగోలు చేసి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, కేంద్రాల వద్ద రైతులు, హమాలీలకు నీడ కోసం షామియానాలు ఏర్పాటుచేయాలని తాగునీరు సమకూర్చాలని సూచించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

రెవెన్యూ, అటవీ భూసమస్యల పరిష్కారానికి ఇరు శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో రెండు శాఖల అధికారులతో సమావేశమైన ఆయన రెవెన్యూ, అసైన్‌మెంట్ తదితర భూసమస్యలపై సమీక్షించి సూచనలు చేశారు. ఎస్ఆర్ఎల్‌పీ ప్రాజెక్టుకు వినియోగించిన అటవీ శాఖ భూములకు బదులు రెవెన్యూ భూములను సమకూర్చాలని, భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా జాయింట్ సర్వే చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు



ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, కమిషనర్ ఆదర్శ్

ప్రణాళికాయుతంగా లక్ష్యసాధన

హరితహారంలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని ప్రణాళికాయుతంగా పూర్తి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి పర్యవేక్షణ, సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023లో 32.47లక్షలు, 2024లో 31.06 మొక్కలు నాటాలనేది లక్ష్యం కాగా శాఖల వారీగా కార్యాచరణ రూపొందించి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కాగా, కలెక్టరేట్ ఆవరణలో రూ.27కోట్లతో నిర్మించనున్న ఈవీఎంల గోదాం స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి సూచనలు చేశారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, డీఆర్డీఓ విద్యాచందన, డీసీఓ విజయకుమారి, డీసీఎస్ఓ రాజేందర్, ఆర్డీఓ కిషన్‌రావు, డీఎం సోములు, డీఎంఓ నాగరాజు, మార్క్‌ఫెడ్ డీఎం సునీత, జెడ్పీ సీఈఓ అప్పారావుతో పాటు వివిధ శాఖల అధికారులు శ్యాంప్రసాద్, శ్రీనివాసరావు, రాంబాబు, విశ్వనాథ్, రవీంద్రనాథ్, సూర్యనారాయణ, సరిత, రంగప్రసాద్ నాయక్, శ్రీనివాసులు, మల్లీశ్వరి, మదన్‌గోపాల్, రైస్ మిల్లర్ల అసిసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల మొదటి వారంలోగా తాగునీటి పథకాలు పూర్తి

ఖమ్మంఅర్బన్: నగరంలో తాగునీటి సరఫరా కోసం నిర్మిస్తున్న ఓహెచ్ఎస్ఆర్, ఈఎల్ఎస్ఆర్ పనులను వచ్చే నెల మొదటి వారం లోగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి నగరంలోని 3, 7, 15వ డివిజన్లలో నిర్మిస్తున్న ట్యాంకుల పనులను పరిశీలించి సూచనలు చేశారు. ప్రజలకు నిత్యం నీరు సరఫరా చేసేలా పనుల్లో వేగం పెంచాలన్నారు. అనంతరం ఖానాపురంలో సమీకృత మార్కెట్ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈ నవీన్, ఏఈ హుస్సేన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

25వ తేదీలోగా పాఠశాలల్లో చేరాలి

భద్రాచలం అర్బన్: రానున్న విద్యాసంవత్సరం గిరిజన గురుకులాల్లో 6, 7, 8, 9వ తరగతిలో ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా చేరాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు ఓ ప్రకటనలో సూచించారు. ఇటీవల నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయని తెలిపారు. ఈమేరకు సంబంధిత వెబ్‌సైట్ నుంచి పత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని కేటాయించిన పాఠశాలలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, టీసీ, బోనఫైడ్ సమర్పించి అడ్మిషన్ పొందాలని సూచించారు.

సౌదీలో ఉంటూ.. అసత్య ప్రచారం

ఖమ్మంక్రైం: సౌదీలో ఉంటున్న ఖమ్మం వాసి ఒకరు వాట్సాప్ గ్రూపుల్లో నాయకులు, మతాలపై అసత్య ప్రచారం చేస్తుండడంతో పోలీసులు చర్యలకు సిద్ధమయ్యారు. ఖమ్మంకు చెందిన సదరు వ్యక్తి సౌదీలో ఉంటూ నగరానికి చెందిన నాయకులు, పలు మతాలపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడుతుండడంతో ఖమ్మం వన్ టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే, ఆయనను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. కేసు కొద్దిరోజులుగా పెండింగ్‌లో ఉండడంతో గురువారం పోలీసులు హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆయనకు కుటుంబ సభ్యులను కలిసి కేసు వివరాలతో నోటీసులు ఇవ్వడమే కాక పాస్‌పోర్ట్, తదితర వివరాలు సేకరించినట్లు తెలిసింది.

రేపటి నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

ఖమ్మంఅర్బన్: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఈ నెల 20వ తేదీ నుంచి ముప్పై రోజుల పాటు గ్రామీణ ప్రాంత యువకులకు మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్ నిర్వహణపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 18 నుంచి 45 ఏళ్ల మహిళలే అర్హులని, ఎస్సెస్సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్, నాలుగు ఫొటోలతో ఖమ్మం రూరల్ మండలం తరుణి హట్‌లోని కార్యాలయంలో ఉదయం 10నుండి సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు అందజేయాలని డైరెక్టర్ విశాల్‌దేవ్ తెలిపారు. ఉచిత శిక్షణతోపాటు హాస్టల్ వసతి, భోజన సౌకర్యం, యూనిఫాం, శిక్షణ పూర్తయ్యాక టూల్ కిట్లు అందిస్తామని పేర్కొన్నారు. కేవలం 35మంది మాత్రమే అవకాశం ఉన్నందున దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 63014 38045, 98850 62799, 81253 94333 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన జరగగా వెంకట్ మాట్లాడారు. పెరుగుతున్న ధరలతో పేదలు నిత్యావసర సరుకులు కొనలేక ఇబ్బంది పడుతున్నందున రేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. అలాగే, ప్రభుత్వం హామీ మేరకు పోడు హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములుతో పాటు బుర్రి ప్రసాద్, పొన్నం వెంకటేశ్వరరావు, ఎర్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 26మంది హాజరు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన టేకులపల్లిలోని మోడల్ కెరీర్‌సెంటర్‌లో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 26 మంది హాజరు కాగా తొమ్మిది మందిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేసినట్లు ఉపాధి కల్పన శాఖ జిల్లా అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీకి యత్నం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 10వ డివిజన్ చైతన్యనగర్‌లో గురువారం రాత్రి ఒక మహిళ మెడలో నుంచి గొలుసు చోరీకి యువకుడు యత్నించాడు. ఇటీవల ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు చేసిన అనంతరం రెవెన్యూ శాఖకు చెందిన మహిళా ఉద్యోగి వెళ్తుండగా ఓ యువకుడు ఆమె మెడలో గొలుసును లాగాడు. అయితే, ఆమె కేకలు వేయడంతో యువకుడు పారిపోగా, స్థానికులు వెంబడించినా ఫలితం కనరాలేదు.

రైలు కిందపడి ఆత్మహత్య

మధిర: అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి గురువారం మధిర– మోటమర్రి రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కల్లూరు మండలం చిన్నకోరుకొండికి చెందిన రెడ్డి మాధవ(42) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీపాన డౌన్ లైన్‌లో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై కేసు నమోదు చేసినటుల జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

పారాహుషార్!



- జిల్లా అంతటా దొంగలతో బేజార్
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలు
- ఖమ్మంతో పాటు వైరా, సత్తుపల్లిలో వరుస చోరీలతో జనం బెంబేలు

ఖమ్మంక్రైం: ఖమ్మం నగరంలోని త్రీటౌన్ ప్రాంతం సారథినగర్‌లో ఇటీవల ఒకేరోజు పది నివాసాల్లో చోరీ జరిగింది. ఖమ్మం టూటౌన్, వనటౌన్, ఖానాపురం ప్రాంతాల్లో సైతం పట్టపగలే చోరీలు జరిగాయి. ఇక వైరా, సత్తుపల్లిలోనూ వరుసగా చోరీలు సర్వసాధారణమయ్యాయి. ఇవేకాక మారుమూల ఉన్న గ్రామాలు, మండలాలను సైతం దొంగలు వదిలి పెట్టడంలేదు. దీంతో వేసవి సెలవుల్లో సరదాగా గడిపేందుకు విహార యాత్రలకు.. ఆలయ దర్శనానికి వెళ్లాలంటే జనం బెంబేలెత్తిపోతున్నారు.

తాళాలు వేస్తే ఖతం

తాళాలు వేసి ఉన్న ఇళ్లను దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఉదయం సాధారణ వ్యక్తుల్లా వీధుల్లో తిరుగుతూ.. ఇంటి అద్దె ఇతర అవసరాల కోసం వచ్చినట్లుగా నమ్మబలుకుతున్నారు. ఈమేరకు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రివేళ చోరీకి పాల్పడుతున్నారు. జిల్లాలో అధిక శాతం చోరీలు తాళం వేసి ఇళ్లలోనే జరగడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

సెలవుల ఆరంభం నుంచే అలజడి

వేసవి సెలవులు మొదలైనప్పటి నుంచే జిల్లాలో దొంగల అలజడి కూడా ప్రారంభమైంది. సెలవుల్లో పలు కుటుంబాల వారు పుణ్యక్షేత్రాలు, విహార యాత్రలు, బంధువుల ఇళ్లలో శుభకార్యాలకు వెళ్తుంటారు. దీనిని దుండగులు అవకాశంగా తీసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. కొన్నిసార్లయితే ఇంటికి తాళం వేసి ఇంకో వీధికి వెళ్లొచ్చే సరికి చోరీ జరుగుతుండడం గమనార్హం. వేసవి కాలంలోనే అత్యధికంగా దొంగతనాలు జరుగుతుండగా.. ఎక్కడో యాత్రలో ఉన్న వారికి ఈ విషయం తెలియగానే ఆగమేఘాలపై ఆందోళనగా రావాల్సి వస్తోంది.

గత నాలుగు నెలల్లో చోరీలు ఇలా...

నమోదైన కేసులు	117
చోరీ సొత్తు విలువ	రూ.1.70కోట్లు
రికవరీ చేసిన సొత్తు	రూ.70లక్షలు

ఈ సూచనలు పాటిస్తే మేలు..

వేసవి సెలవుల్లో ఇండ్లకు తాళాలు వేసి వెళ్లే వారు పలు సూచనలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. తాళం వేసి వెళ్లేవారు ఇంటిచుట్టు పక్కల ఉన్న వారికి తమ ఇంటిని గమనించాలని చెప్పాలి. అలాగే, సమీప పోలీసుస్టేషన్‌లోనూ సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో పెట్రోలింగ్‌కు అవకాశం ఉంటుంది. తాళం వేసి ఊరికి వెళ్లేటప్పుడు ఇంటి ముందు లైట్ ఉంటే వేయడం అలవాటుగా మార్చుకోవాలి. అలాగే, నాణ్యమైన తాళాలనే వేయాలి. వృద్ధులు, దివ్యాంగులను ఒంటరిగా వదిలివేసి ఊర్లకు వెళ్లొద్దు. అదే జరిగితే వారికి దొంగలను ప్రతిఘటించే శక్తి ఉండక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఎదురవుతుంది. విలువైన బంగారాన్ని తప్పక బ్యాంక్ లాకర్‌లో భద్రపర్చాలి. అపరిచితులు కనిపిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలి.

విస్తృతంగా పెట్రోలింగ్ చేస్తున్నాం...



వేసవి కాలంలో పెట్రోలింగ్ విస్తృతం చేశాం. దొంగతనాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో ఇప్పటికే సర్పంచ్‌లు, గ్రామ కమిటీలను అప్రమత్తం చేశాం. అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటుచేసేలా అవగాహన కల్పిస్తున్నాం. వేసవి సెలవుల్లో తాళం వేసి వెళ్లే వారు సమీప పోలీసుస్టేషన్లలో సమాచారం ఇస్తే మంచిది. అలాగే, విలువైన వస్తువులు, డబ్బును ఇంట్లో ఉంచొద్దు.

– విష్ణు ఎస్.వారియర్, పోలీసు కమిషనర్

ట్రాఫిక్ పద్మవ్యూహం



కిన్నెర సెంటర్‌లో అస్తవ్యస్తంగా ట్రాఫిక్

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. కిన్నెర సెంటర్‌లో సిగ్నల్స్ పనిచేయక పోవడంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వెళ్తున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మరోవైపు పాత బస్టాండ్‌కు వచ్చే బస్సులు, ఇతర వాహనాల రద్దీపై నియంత్రణ లేక స్థానికులు అవస్థ పడుతున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టాలని రాస్తారోకో



రాస్తారోకోలో పాల్గొన్న రైతులు, నాయకులు

వైరారూరల్: మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలనే డిమాండ్‌తో మండలంలోని గొల్లపూడిలో వైరా – మధిర రాష్ట్రీయ రహదారిపై గురువారం రైతులు రాస్తారోకో చేపట్టారు. రైతు సంఘం ఆధ్వర్యాన చేపట్టిన రాస్తారోకోలో గొల్లపూడి, గొల్లెనపాడు, అష్టగుర్తి తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ వైరా మండలంలో పలు గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగు చేసిన రైతుల ఇక్కట్లను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారని తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయించుకోవాల్సి వస్తోందన్నారు. కాగా, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సునీత, వైరా సొసైటీ చైర్మన్ బొర్రా రాజశేఖర్, సీఈఓ నర్సింహారావు కొనుగోళ్లపై హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. రైతులు రాస్తారోకో నేపథ్యాన గంట మేర వాహనాలు నిలిచిపోయాయి. సీపీఎం, రైతు సంఘం మండల కార్యదర్శులు తోట నాగేశ్వరరావు, కిలారు శ్రీనివాసరావుతో పాటు వెంపటి చంద్రశేఖర్, అమరనేని అప్పారావు, అమరనేని వెంకటేశ్వరరావు, నల్లమోతు రాజాబాబు, వెంపటి రాజా, చంద్ర ప్రసాద్, వెంకట్రావు, రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టిజన్లపై బదిలీ వేటు

- ఇటీవల సమ్మెలో పాల్గొన్న వారిపై జెన్‌కో యాజమాన్యం చర్యలు
- కేటీపీఎస్ నుంచి 16 మందికి స్థానచలనం
- విధుల నుంచి తొలగించిన కార్మికులను ఇంకా చేర్చుకోని వైనం

పాల్వంచ: ఇటీవల చేపట్టిన సమ్మెలో పాల్గొన్న ఆర్టిజన్ కార్మికులపై జెన్‌కో యాజమాన్యం క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. ఇప్పటికే పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో ఇద్దరు ఆర్టిజన్లను విధుల నుంచి తొలగించింది. వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చినా ఇంకా చేర్చుకోలేదు. కాగా గురువారం 16 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత నెల 25న సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆర్టిజన్ కార్మికులు ప్రకటించారు. ఈ క్రమంలో కార్మికులు సమ్మెకు వెళ్లొద్దని పేర్కొన్న జెన్‌కో ఉన్నతాధికారులు 144 సెక్షన్ అమలు చేశారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు విశ్వప్రయత్నాలు చేసి సఫలీకృతమయ్యారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా విధులు బహిష్కరించడంతోపాటు ఆందోళనలో ఇతర కార్మికులు సైతం పాల్గొనేలా ప్రేరేపించారంటూ ఆ మరుసటి రోజే సుమారు 200 మందిని ఏకకాలంలో విధుల నుంచి తొలగించారు. ఈ క్రమంలో కేటీపీఎస్ నుంచి ఉండేటి జయరాజు, ఆవుల కృష్ణారెడ్డి తమ ఉద్యోగాలు కోల్పోయారు. అనంతరం జెన్‌కో, ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్ రావు, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డితో జరిపిన చర్చల్లో.. తొలగించినవారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు వారిని చేర్చుకోలేదు.

తాజాగా 16మందిపై బదిలీ వేటు

ఆర్టిజన్ల సమ్మెలో పాల్గొనడంతోపాటు ఇతరులను ప్రేరేపించిన వారిపై విజిలెన్స్ ఆరా తీసింది. ఈ క్రమంలో వారిపై చర్యలకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా పనిష్మెంట్ కింద ఎవరినైనా బదిలీ చేయాలంటే థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి జల విద్యుత్ కేంద్రాలైన శ్రీశైలం, నాగర్జున సాగర్‌లకు బదిలీ చేస్తుంటారు. ఇప్పుడు కూడా అలాగే పలువురికి స్థానచలనం కల్పించారు. కాగా, ఈ బదిలీలను జెన్‌కో విజిలెన్స్ ఓఎస్డీ వినోద్ కుమార్ ధ్రువీకరించారు.

బదిలీ వేటుకు గురైన కార్మికులు

- కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారానికి చెందిన సయ్యద్ సమీవుల్లా(గ్రేడ్2)ను శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రికల్ స్టేషన్‌కు, సయ్యద్ జిలానీ పాషా(గేడ్4)ను నాగార్జునసాగర్ హైడ్రో ఎలక్ట్రికల్ స్టేషన్, సోమనబోయిన నవీన్‌ను(గ్రేడ్3) సింగూరు మినీ హైడల్ ప్రాజెక్ట్, వెంపటి అనిల్(గ్రేడ్1)ను రామగుండం, బి.రాంబాయి(గ్రేడ్4), బోగా శ్రీకాంత్‌ను లోయర్ జూరాల హైడ్రో ఎలక్ట్రికల్ స్టేషన్, ఎస్.శ్రీపతి రాజు(గ్రేడ్4), ఎం.డీ.మసూద్(గ్రేడ్2)ను జూరాల హైడ్రో ఎలక్ట్రికల్ స్టేషన్‌కు యాజమాన్యం బదిలీ చేసింది.
- కేటీపీఎస్ 7వ దశ కర్మాగారం నుంచి వి.రామకృష్ణ(గ్రేడ్2,), ఆర్.శ్రీను(గ్రేడ్2), ఎస్‌వి.లక్ష్మీనారాయణ(గ్రేడ్2)ను రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌కు, ఎన్.కోటయ్య(గ్రేడ్4), ఎ.హన్మంతరావును భూపాలపల్లి కేటీపీఎస్‌కు బదిలీ చేశారు.
- శ్రీశైలం నుంచి కె.నాగూల్(గ్రేడ్2)ను మినీ హైడల్ ప్రాజెక్ట్ పోచంపాడుకు, టి.చంద్రశేఖర్ (గ్రేడ్3) పాలేరు మినీ హైడల్ ప్రాజెక్ట్‌కు, ఎస్.రాఘవేందర్‌రెడ్డి(గ్రేడ్2)ను పాలేరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు కేబినెట్ ఆమోదం

ఇరిగేషన్ శాఖ నుంచి 23 ఎకరాలు కేటాయింపు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై గురువారం హైదరాబాద్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు నీటిపారుదల శాఖకు చెందిన 23 ఎకరాలను జర్నలిస్టులకు కేటాయించేందుకు ఆమోదం లభించింది. కాగా, జిల్లా కేంద్రంలో పనిచేసే జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు పంపిణీ చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇళ్ల స్థలాల కేటాయింపుపై నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రివర్గానికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. అలాగే, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మరో ప్రకటనలో హర్షం వ్యక్తం చేయగా.. ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శివసత్తుల పండుగ



సన్మానం అందుకున్న పెద్దలు

ఖమ్మంగాంధీచౌక్: శివసత్తుల పెద్దల పండుగను గురువారం ఖమ్మం రూరల్ మండలంలోని మారెమ్మ గుడి వద్ద జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన శివసత్తులు పాల్గొని సమస్యలపై చర్చించారు. అనంతరం లైలా మాలకమ్మ, మేరీ మాలకమ్మ, ఉప్పిసాయి స్వామి మాట్లాడుతూ శివసత్తులు ఐకమత్యంతో ఉంటూ ఆచార వ్యవహారాలను పాటించాలని సూచించారు. అనంతరం పెద్దలుగా శ్రీను స్వామి, వెంకటస్వామి, లక్ష్మీరసింహ, మైసు, సైదులు, నాగిరెడ్డి, వెంకీ, పరకాల జంపమ్మ తదితరులను ఎన్నుకుని ఒడిబియ్యం పోసి, బండారి వేసి బాధ్యతలు అప్పగించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్యాయత్నం



ఆటోలో సాయికుమార్‌ను తీసుకెళ్తున్న బంధువులు

నేలకొండపల్లి: మండలంలోని ఇద్దరు యువకులు వేర్వేరుగా కారణాలతో గురువారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని బుద్ధారానికి చెందిన జి.సాయికుమార్ కుటుంబ కలహాలతో ఉరి వేసుకున్నాడు. దీంతో ఆయనను నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా ప్రాథమిక చికిత్స చేసిన వైద్యాధికారి కె.రాజేష్ ఖమ్మం తరలించాలని సూచించారు. ఇక అనాసాగారానికి చెందిన గడ్డి మందు తాగగా ఆయనను కూడా ఆస్పత్రికి తీసుకొస్తే ఖమ్మం రిఫర్ చేశారు. కానీ 108 వాహనం కోసం ఎదురుచూసినా రాకపోవటంతో బాధిత కుటుంబాలు ఆటో మాట్లాడుకుని ఖమ్మం తీసుకెళ్లారు.

వాహనానికి నిప్పు పెట్టిన యువకుడు?

బోనకల్: అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని మందలించడంతో అర్ధరాత్రి సమయాన మోటర్ సైకిల్‌ను దగ్ధం చేశాడు. బోనకల్‌కు చెందిన పంతంగి శ్రీనివాసరావు బుధవారం అర్ధరాత్రి సమయాన మూత్రవిసర్జన నిమిత్తం బయటకు రాగా ఇంటి ముందు పార్క్ చేసి ద్విచక్రవాహనం కాలి పోతూ కనిపించింది. దీంతో మంటలు ఆర్పి ఆరా తీయగా రైల్వే కాలనీకి చెందిన రాజేష్ అటు వైపు వచ్చాడని రైల్వే వాచ్‌మెన్ చెప్పాడు. ఈనెల 14న సదరు యువకుడు శ్రీనివాసరావు ఇంటి ముందు తచ్చాడుతుండడంతో ఆరా తీయగా పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీనిపై గట్టిగా నిలదీయగా తన పేరు రాజేష్ అని, రైల్వే కాలనీలో ఉంటానని చెబుతూ శ్రీనివాసరావు అంతు చూస్తానని బెదిరించినట్లు సమాచారం. దీంతో సదరు యువకుడే కక్ష్యతో వాహనానికి నిప్పు పెట్టి ఉంటాడని శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికెన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

కూసుమంచి: మండల కేంద్రంలోని ఓ చికెన్ సెంటర్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. కోళ్లను శుభ్రం చేస్తున్న క్రమంలో సిలిండర్ నుంచి గ్యాస్ లీకేజీ అయి మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఎస్సై రమేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి



పెద్ద ముత్తయ్య (ఫైల్)

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెంకు చెందిన వృద్ధుడు వడదెబ్బతో అస్వస్థతకు గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన కంకణాల పెద్ద ముత్తయ్య (85) రెండు రోజులుగా ఎండలు, వడగాలులతో వడదెబ్బకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తుండగా గురువారం ఉదయం మృతి చెందగా వివిధ పార్టీల నాయకులు భూక్యా వీరభద్రం, షేక్ ఖాసీం, ఏలూరి శ్రీనివాసరావు, దొడ్డపనేని కృష్ణార్జునరావు, ఆలవాల తిరుమలరావు, రోషన్‌బేగ్, అఫ్జల్, కొండలరావు, వెంకటి తదితరులు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

మధిర మండలంలో..

మధిర: మధిర మండలం మల్లవరం గ్రామానికి చెందిన చారుగుండ్ల కస్తూరి(60) వడదెబ్బతో మృతి చెందింది. రెండు రోజులుగా ఆమె అస్వస్థతకు గురికావడంతో గురువారం ఉదయం బంధువులు ఆర్‌ఎంపీ ప్రాథమిక చికిత్స చేయించారు. సాయంత్రానికి పరిస్థితి మరింత క్షీణించడంతో మృతి చెందింది

ట్రావెల్స్ బస్సు బోల్తా

క్షేమంగా బయటపడిన ప్రయాణికులు



రహదారి పక్కన బోల్తా కొట్టిన బస్సు

కూసుమంచి: ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఖమ్మం నుండి సూర్యాపేట వెళ్తున్న ఈ బస్సు జిల్లా సరిహద్దు కూసుమంచి మండలం నాయకన్‌గూడెం దాటాక రహదారి నుండి పక్కకు దూసుకెళ్లి బోల్తా కొట్టింది. అయితే, రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ రాళ్లకు ఆనుకుని పడటంతో పూర్తిగా కిందపడలేదు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఘటన సమయంలో బస్సులో 13 మంది ప్రయాణికులు ఉండగా ఒక మహిళకు మాత్రమే స్వల్ప గాయాలయ్యాయి. ఈఘటన సూర్యాపేట జిల్లా మోతె పరిధిలో జరగడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ముదిగొండ: అనారోగ్య కారణాలతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని వనంవారి కిష్టాపురానికి చెందిన వేముల కోటయ్య(55) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కడుపునొప్పి తాళలేక ఆయన బుధవారం పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు ఆయన భార్య ముత్తమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


రఘునాథపాలెం: మండలంలోని చెరువు కొమ్ము తండాలో పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో పాడి గేదెలు మృతి చెందాయి. వారం క్రితం గాలివానతో పొలంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. స్థానిక రైతులు విద్యుత్ అధికారులకు చెప్పినా మరమ్మతు చేయకపోవడంతో తెగిన లైన్‌కు సరఫరా అవుతోంది. దీంతో గురువారం మేతకు వెళ్లిన బానోత్ శంకర్, బదావత్ మంగ్యా, కృష్ణ, నాగేశ్వరరావుకు చెందిన నాలుగు పాడిగేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. ఈ విషయంపై విద్యుత్ ఏడీ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎర్త్ వైర్ ద్వారా విద్యుత్ సరఫరా జరిగినట్లు తెలిసిందని చెప్పారు. కాగా, రైతులకు పరిహారం అందించాలని మాజీ సర్పంచ్ రమేష్ కోరారు.

కోతల్లేని కరెంట్..

రాష్ట్రంలో ఇదివరకెన్నడూ లేనంతగా పెరిగిన వినియోగం

రోజుకు 248 మిలియన్ యూనిట్లు దాటిన వాడకం

- గత ఏడాది కంటే 27.51 శాతం అధిక డిమాండ్
- అయినా ఎక్కడా కోతల్లేకుండా నిరంతరాయంగా సరఫరా
- సీఎం జగన్ ముందుచూపు వల్లే ఇది సాధ్యం
- డిమాండ్ పెరిగి.. సాంకేతిక కారణాల వల్లే అక్కడక్కడ ట్రిప్
- నిమిషాల వ్యవధిలో సరిచేస్తున్న అధికారులు, సిబ్బంది
- గత ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలతో అల్లాడిన ప్రజలు
- అధికారికంగానే గంటల తరబడి కోతలు
- ఆ రోజులు మరిచి దుష్ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా



విద్యుత్ వెలుగుల్లో విజయవాడ

నాడు చీకటి రోజులు

గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 'పట్టణాల్లో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు.. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.. గ్రామీణ ప్రాంతాల్లో అయితే పగలంతా విద్యుత్ సరఫరా ఉండదు' అని అధికారికంగా ప్రకటనలు జారీ అయ్యేవి. 'ఎండా కాలం కదా.. పవర్ కట్ మామూలే' అని అప్పటి పాలకులు దబాయించే వారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలిసేది కాదు. వంటింట్లో మిక్సీలు తిరక్క గృహిణులు, హాల్లో ఫ్యాన్ తిరక్క పిల్లలు, ఆఫీసుల్లో ఏసీలు పనిచేయక ఉద్యోగులు, జిరాక్స్ సెంటర్ల వద్ద విద్యార్థుల పాట్లు అన్నీ ఇన్నీ కాదు. విద్యుత్ ఎప్పుడొస్తుందా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సి వచ్చేది. ఆ రోజులను గుర్తు చేస్తే చాలు ప్రజలు కథలు కథలుగా చెబుతారు.

నేడు వెలుగు జిలుగులు

ఎక్కడా 'విద్యుత్ కోత' అన్న పదానికి తావు లేకుండా సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో వ్యవహరించారు. గృహాలకు, పరిశ్రమలకు, వ్యవసాయానికి ఏ రీతినా సమస్య లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం బొగ్గు నిల్వలు సరిపడా ఉండేలా చూసుకోవడంతోపాటు బయటి మార్కెట్‌లోనూ విద్యుత్ కొనుగోలు చేశారు. సరఫరాలో నాణ్యత పెరిగేలా వ్యవస్థాగత మార్పులు చేశారు. ఈ ఏడాది ఇదివరకెన్నడూ లేనంతగా అనూహ్యంగా డిమాండ్ పెరగడంతో అక్కడక్కడ ఓవర్‌లోడ్‌తో ట్రిప్ కావడం తప్పించి ఏ సమస్యా లేకుండా శ్రద్ధ పెట్టారు. అలాంటి చోట్ల నిమిషాల వ్యవధిలోనే మరమ్మతులు చేసేలా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. తద్వారా ఇళ్లలో, కార్యాలయాల్లో ఎక్కడా 'విద్యుత్ కోత' అన్న మాటే వినిపించడం లేదు. ఫ్యాన్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి.

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇదివరకెన్నడూ లేని విధంగా విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ, ఎక్కడా కోతలన్నదే లేకుండా సరఫరా సవ్యంగా సాగుతోంది. ఆర్థిక కార్యకలాపాలు గణనీయంగా పెరగడం, ఎండలు మండిపోతుండటం వల్ల విద్యుత్ వినియోగం అమాంతం పెరిగింది. అయినా కాసేపు కూడా విద్యుత్ కోత లేకుండా నిరంతరాయంగా సరఫరా జరిగేలా సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో వ్యవహరించారు. గత సంవత్సరం గరిష్ట డిమాండ్‌తో పోలిస్తే ఇప్పుడు 27.51 శాతం అధికంగా ఉంది. ఉష్ణోగ్రత 46 డిగ్రీలు దాటుతోంది. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఫలితంగా ఇంట్లో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు వంటి గృహోపకరణాలు నిరంతరం పనిచేస్తున్నాయి. ఎక్కువ సమయం ఇంట్లోనే గడపడం వల్ల మిక్సీలు, గ్రైండర్లు, టీవీలు, కంప్యూటర్ల వినియోగం కూడా అధికంగానే ఉంటోంది. మరోవైపు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో పెరిగిపోయింది. రోజువారీ డిమాండ్ 248.985 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. గత ఏడాది ఇదే సమయానికి 195.266 మిలియన్ యూనిట్లుగా ఉండింది. రోజులో పీక్ డిమాండ్ 12,482 మెగావాట్లుగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 9,308 మెగావాట్లు మాత్రమే. అంటే 34.10 శాతం పెరిగింది. పగటి పూట సగటు పీక్ డిమాండ్ 10,374 మెగావాట్లు, సాయంత్రం వేళల్లో 9,582 మెగావాట్లకు చేరుకుంది. అయినప్పటికీ గృహ, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్‌కు ఇబ్బంది లేకుండా, డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సంస్థలు నిరంతరం కరెంట్ సరఫరా చేస్తున్నాయి. ఇలా దేశంలోనే ఎక్కడా జరగడం లేదని, రాష్ట్రం అభివృద్ధిపథంలో పయ నిస్తోందని చెప్పడానికి ఇదొక పెరామీటర్‌గా చెప్పవచ్చని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు.

ముందుచూపుతో విద్యుత్ కొనుగోలు

ప్రస్తుతం ఏపీజెన్కో థర్మల్ నుంచి 89.981 మి.యూ, ఏపీ జెన్‌కో హైడల్ నుంచి 5.414 మి.యూ, సెంట్రల్ జెనరేటింగ్ స్టేషన్ల నుంచి 43.012 మి.యూ, సెయిల్, హెచ్‌పీసీఎల్, గ్యాస్ వంటి ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ల నుంచి 28.510 మి.యూ, సోలార్ నుంచి 25.605 మి.యూ, విండ్ నుంచి 11.591 మి.యూ, ఇతర మార్గాల్లో 1.496 మిలియన్ యూనిట్ల చొప్పున విద్యుత్ సమకూరుతోంది. అయితే ఇది మాత్రమే సరిపోవడం లేదు. దీంతో బహిరంగ మార్కెట్ నుంచి యూనిట్ సగటు రేటు రూ.7.537 చొప్పున రూ.33.936 కోట్లతో 45.023 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ప్రతిరోజూ కొనుగోలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈవిధంగా డిమాండ్‌ను అందుకోలేక భారీగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. జార్ఖండ్‌లో 4.62 మి.యూ, హర్యానాలో 2.64 మి.యూ, ఉత్తరప్రదేశ్‌లో 2.03 మి.యూ, కర్ణాటకలో 1.97 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఏర్పడింది.

వాస్తవాలు మరచి దుష్ప్రచారం

ఎక్కడా విద్యుత్ కోతలు లేకపోయినప్పటికీ చంద్రబాబుకు లబ్ధి చేకూర్చేలా ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తోంది. గత చంద్రబాబు ప్రభుత్వం హయాంలో విద్యుత్ సరఫరా దుస్థితిని వ్యూహాత్మకంగా విస్మరిస్తోంది. గంటల తరబడి కోతలు విధించారనే విషయాన్ని దాస్తోంది. అప్పట్లో వేసవిలో కరెంటు పరిస్థితి చెప్పనలవి కాదు. వేసవిలో కాకుండా కూడా కోతలు విధించిన రోజులున్నాయి. పరిశ్రమలకైతే ఏకంగా పవర్ హాలిడేలు ఇచ్చారు. వారంలో మూడు రోజులు పరిశ్రమలన్నింటికీ తాళం వేయాల్సి వచ్చేది. జిరాక్స్ మెషీన్లు, పిండి మరలు, కూల్ డ్రింక్స్ దుకాణాలు, కూలింగ్ వాటర్ ప్లాంట్లు గంటల తరబడి పని చేయక చిరు వ్యాపారులు నష్టాలు చవిచూశారు. విద్యుత్ కోతల గురించి మాట్లాడితే అప్పటి ప్రభుత్వ పెద్దలు, మంత్రులు దబాయించే వారు. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెడుతూ సీఎం జగన్ ప్రభుత్వం కోత అన్నదే లేకుండా విద్యుత్ సరఫరా చేస్తుంటే ఎల్లో మీడియాకు కడుపు మండుతోంది. వంకర బుద్ధి చూపిస్తూ.. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో విద్యుత్ పోయిన ప్రాంతాలను చూపుతూ దుష్ప్రచారం చేస్తోంది.

కోతల్లేకుండా ఇదే ప్రథమం

మాది పాలిమర్ ప్రాసెసింగ్ యూనిట్. రోజుకు 500 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగిస్తుంటాం. అయినప్పటికీ ఈ వేసవిలో ఏ రోజూ విద్యుత్ కొరత రాలేదు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారు. ఫలితంగా ప్రొడక్షన్ ఆగడం లేదు. గతంలో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండేవి. గంటల తరబడి మెషీన్లు ఆపితే తిరిగి అవి వేడెక్కేందుకు చాలా సమయం పట్టేది. మధ్యలో ఆగిపోవడం వల్ల సరుకు పాడయ్యేది. అందువల్ల ఆర్థికంగా చాలా నష్టపోయేవాళ్లం. ఇప్పుడు ఆ బాధలే లేవు. – ఐ.సురేష్ బాబు, పారిశ్రామికవేత్త, విశాఖపట్నం జిల్లా

ఇప్పుడు ఆ పరిస్థితి లేదు

నేను 300 ఎకరాల చెరువుల్లో చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నాను. ఏమాత్రం విద్యుత్ సరఫరా ఆగినా చాలా ఇబ్బంది పడిపోతాం. గతంలో అలాగే చాలా నష్టపోయాం. అప్పట్లో కరెంటు కోతలు ఎక్కువగా ఉండేవి. జనరేటర్లు పెట్టుకునే వాళ్లం. డీజిల్ మోటార్లతో నీరు తోడుకునేవాళ్లం. దానివల్ల పెట్టుబడి ఖర్చులు ఎక్కువయ్యేవి. చేతికొచ్చేది ఏమీ ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆక్వాకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌ను సబ్సిడీతో అందించడంతో పాటు విద్యుత్ కోతలు లేకుండా మా వంటి రైతులకు మేలు చేస్తోంది.
– ముంగర నరసింహారావు, ఆక్వా రైతు, ఆకివీడు, పశ్చిమగోదావరి జిల్లా

గత ప్రభుత్వ హయాంలో కోతలిలా

ఏడాది	మిలియన్ యూనిట్లు
2014–15	2202.07
2015–16	20.98
2016–17	34.89
2017–18	10.06
2018–19	6.50
2019–20	36.11

'గుండెపోటు' మాటే లేదు

ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం

- సీబీఐ ఎస్పీ నన్ను కలసినప్పుడు ఆ పదమే చర్చకు రాలేదు
- నేను చెప్పని అంశాలను చెప్పినట్లు ఆంధ్రజ్యోతి ఎలా రాస్తుంది?
- జర్నలిజం దిగజారుడుతనానికి పరాకాష్ట అంటే ఇదే

సాక్షి, అమరావతి: మేనిఫెస్టో కమిటీ సమావేశానికి, హత్య కేసుకు సంబంధం ముడిపెడుతూ కథనాలను ప్రచురించటాన్ని బట్టి ఆంధ్రజ్యోతి ఏ స్థాయికి దిగజారిందో అర్థం అవుతోందని ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం వ్యాఖ్యానించారు. వైఎస్ వివేకా గుండెపోటుతో మృతి చెందినట్లు వైఎస్ జగన్ తనకు చెప్పారంటూ ఆంధ్రజ్యోతి ప్రచురించిన వార్త పచ్చి అబద్ధమని అజేయ కల్లం ఖండించారు. అంతకుముందే మేనిఫెస్టో కమిటీ సమావేశం జరిగిందని, అందులో పాల్గొన్న వారిని విచారించాలంటూ గతంలో ఓ కథనం వెలువరించిందని, అందులో భాగంగానే మళ్లీ పచ్చి అబద్ధాలను ప్రచురించిందన్నారు. ఏదో ఒకవిధంగా ముఖ్యమంత్రి జగన్ పేరును లాగాలనే ప్రయత్నం మినహా ఆంధ్రజ్యోతి కథనాల్లో వాస్తవాలు లేవని స్పష్టం చేశారు. సీబీఐ తనను విచారించిందంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తను గురువారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అజేయ కల్లం తీవ్రంగా ఖండించారు. కొద్దిరోజుల క్రితం సీబీఐ ఎస్పీ తన ఇంటికి వచ్చి ఐదు నిమిషాలు మాట్లాడి సమాచారం తీసుకున్నారని, ఆ సమయంలో గుండెపోటు అంశం చర్చకే రాలేదని, దాని గురించి అడగలేదని అజేయ కల్లం వెల్లడించారు. వైఎస్ వివేకానందరెడ్డి మృతి చెందిన రోజు యాదృచ్ఛికంగా పార్టీ మేనిఫెస్టో కమిటీ సమావేశం జరుగుతోందన్నారు. సమావేశం జరుగుతుండగా కొంతసేపటికి 'వివేకానందరెడ్డి గారు నో మోర్..' అని ఇంగ్లిష్‌లో చెప్పడంతో ఇక లేచి వచ్చేశామన్నారు. అదే విషయాన్ని సీబీఐ ఎస్పీకి చెప్పానన్నారు. 'మీరు స్వచ్ఛందంగా అంగీకరిస్తే రికార్డు చేసుకుంటామని సీబీఐ ఎస్పీ కోరారు. సెక్షన్ 161 కింద సమాచారాన్ని అడిగారు. అయితే ఆ సమాచారం, రికార్డుకు న్యాయపరమైన విలువ ఉండదు. సంతకాలు తీసుకోలేదు' అని కల్లం పేర్కొన్నారు.

గుండెపోటు మాటే చర్చకు రాలేదు..

అసలు గుండెపోటు అనే పదమే సీబీఐ ఎస్పీని కలుసుకున్న సందర్భంగా చర్చకు రాలేదని అజేయ కల్లం స్పష్టం చేశారు. కేసు దర్యాప్తులో ఉన్న సమయంలో రహస్యంగా ఉండాల్సిన తమ ఇద్దరి సంభాషణ సమాచారం లీకుల పేరుతో ఆంధ్రజ్యోతిలో రావడం అంటే సీబీఐ విశ్వసనీయత కూడా దెబ్బతిన్నట్లేనని పేర్కొన్నారు. ఇది సీబీఐ పేరును దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. 'మేనిఫెస్టో కమిటీ సమావేశంలో ఆ



"నేను సీబీఐ ఎస్పీకి చెప్పని వాటిని కూడా చెప్పినట్లుగా ఆంధ్రజ్యోతి కథనాలను ప్రచురించడం దిగజారుడు జర్నలిజానికి పరాకాష్ట. వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో మృతి చెందారని వైఎస్ జగన్ నాతో అన్నారని నేను సీబీఐకి వెల్లడించినట్లు వెలువడ్డ కథనం పచ్చి అబద్ధం" – అజేయ కల్లం

పనిమీద దృష్టి పెడతాం కానీ గడియారం చూసుకుంటూ కూర్చోం కదా! ఎవరు ఎప్పుడు బయటకు వెళ్లారో ఎలా తెలుస్తుంది? అయినా ఈ సమావేశాన్ని సీరియస్ మర్డర్ కేసుకు ముడిపెట్టి ఆంధ్రజ్యోతి తనకు కావాల్సినట్లు రాసుకోవడం కంటే అనైతికం మరొకటి ఉండదు..' అని కల్లం మండిపడ్డారు.

ఖండించాల్సిన బాధ్యత సీబీఐపై ఉంది

తన దగ్గర నుంచి తీసుకున్న సమాచారం చార్జిషీటు వేసేవరకు రహస్యంగా ఉండాలని, లీకుల పేరుతో తప్పుడు సమాచారం మీడియాలో ప్రచురితమైనందున ఆ వార్తను ఖండించాల్సిన బాధ్యత సీబీఐపై ఉందని కల్లాం పేర్కొన్నారు. తప్పుడు సమాచారంతో మీడియాలో సమాంతర దర్యాప్తు జరగకూడదని, ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు మీడియాకు వివరాలు వెల్లడించరాదని సుప్రీం కోర్టు తీర్పులున్నాయని కల్లం ప్రస్తావించారు.

నా భార్యకు కూడా తెలియదు..

'దర్యాప్తు అంశాలను ఇష్టానుసారం ప్రచురించేందుకు, మీడియా తమ ఇష్టం అనేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు తాజా తీర్పులున్నాయి. కనీస క్రమశిక్షణ, కోడ్ ఆఫ్ కాండక్ట్ మీడియాకు అవసరం. నేను సీబీఐ ఎస్పీకి చెప్పని అంశాలను చెప్పినట్లుగా నా ఫొటోతో పెద్ద శీర్షిక పెట్టి కథనాలు ప్రచురించటాన్ని బట్టి ఆ పత్రిక ఏ స్థాయికి దిగజారిందో తెలుస్తోంది. ఆ సమయంలో నేను, సీబీఐ ఎస్పీ మాత్రమే ఉన్నాం. మా ఇంటికి సీబీఐ ఎస్పీ వచ్చిన విషయం నా భార్యకు కూడా తెలియదు. ఆంధ్రజ్యోతిలో తప్పుడు వార్త ప్రచురించిన తరువాతే మిగతా వారికి తెలిసింది' అని కల్లం తెలిపారు. తప్పుడు వార్తపై తగిన సమయంలో చర్యలు తీసుకుంటా' అని చెప్పారు.

సమాంతర విచారణ తగదు..

ఏదైనా క్రిమినల్ కేసు దర్యాప్తు జరుగుతున్నప్పుడు దానికి సమాంతరంగా విచారణను ప్రభావితం చేసేలా మీడియా కథనాలను రాయకూడదు, చర్చలు పెట్టకూడదు. దర్యాప్తు సమయంలో విచారణాధికారికి సాక్షులు వెల్లడించిన అంశాలను చార్జిషీట్ వేసేవరకు బహిర్గతం చేయకూడదు. విచారణలో వెల్లడైన అంశాలను బహిర్గతం చేస్తూ కథనాలను ప్రచురిస్తే వ్యక్తిగత స్వేచ్ఛను హరించినట్లేనని పలు కేసుల్లో సుప్రీంకోర్టు, హైకోర్టులు తీర్పులిచ్చాయి. దీన్ని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా స్వాగతించింది' అని కల్లం చెప్పారు.

జిల్లా వార్తలు

గోశాల, నిత్యాన్నదానానికి వితరణ



దాతకు రశీదు ఇస్తున్న ఆలయ అధికారులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానం, గోశాల నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు గురువారం విరాళం అందచేశారు. హైదరాబాద్ తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన కుందురు ఇంద్రసేనారెడ్డి నిత్యాన్నదానానికి రూ.లక్ష, గోశాల నిర్మాణానికి రూ.లక్ష అందచేయగా అధికారులు రశీదు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు సాయిబాబా, రామిరెడ్డి, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పీవీజీటీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

భద్రాచలంఅర్బన్: హైదరాబాద్ హయత్‌నగర్‌లో ఆదిమ, గిరిజన తెగల కోసం ఏర్పాటుచేసిన టీటీడబ్ల్యూఆర్ పీవీటీజీ(బాలురు, బాలికలు)ల్లో ప్రవేశాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొండరెడ్డి బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. 2021–22, 2022–23 విద్యాసంవత్సరాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ కార్యాలయంలో ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 95507 3026 నంబర్‌లో సంప్రదించాలని పీఓ సూచించారు.

పలు రైళ్లు రద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: నెక్కొండ వద్ద మూడో రైల్వే లైన్ పనుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేసినట్లు ఖమ్మం సీసీఏ ఎం.డీ.జాఫర్ తెలిపారు. కాజీపేట–డోర్నకల్ ప్యాసింజర్(07753), డోర్నకల్–కాజీపేట ప్యాసింజర్(07754), విజయవాడ–డోర్నకల్(07755), డోర్నకల్–విజయవాడ(07756) ప్యాసింజర్లతో పాటు రెండు వైపులా శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 21నుండి వచ్చేనెల 7వరకు రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే, మచిలీపట్నం–సికింద్రాబాద్(07185) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–మచిలీపట్నం(07186) ఎక్స్‌ప్రెస్ ఈనెల 21, 28, వచ్చేనెల 4న రద్దు చేసినట్లు తెలిపారు. ఇంకా గుంటూరు–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 21, 23, 25, 27, 28, 30తేదీల్లో రెండు గంటల ఆలస్యంగా నడుస్తుందని వివరించారు.

పోస్టాఫీసుల్లో మళ్లీ ఆధార్!

- కేంద్రాల నిర్వహణ ప్రైవేట్ ఏజెన్సీలకు...
- ఉమ్మడి జిల్లాలో మూడు విడతలుగా 16 కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే ఖమ్మంలోని రెండు పోస్టాఫీసుల్లో ప్రారంభం



ఖమ్మం గాంధీచౌక్ సబ్‌పోస్టాఫీస్‌లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రం



ఖమ్మం జెడ్పీలోని తపాలా కార్యాలయంలో ఆధార్ కేంద్రం

ఖమ్మంగాంధీచౌక్: పోస్టాఫీసుల్లో ఆధార్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తున్నారు. ఇప్పటికే అక్కడక్కడా సేవలు ప్రారంభమయ్యాయి. వ్యక్తి గుర్తింపు, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ లక్ష్యంగా ఆధార్ వ్యవస్థను 2009లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ గుర్తింపు వ్యవస్థ జీవితకాలం చెల్లుబాటవుతుండగా.. నివాస రుజువు, పౌరసత్వ రుజువును ఆధార్ తెలియజేస్తోంది. గతంలోనే ఆధార్ కార్డు వ్యవస్థను మారుమూల ప్రాంతాల వరకు విస్తరించడంలో భాగంగా పోస్టాఫీసుల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే, ఉద్యోగుల కొరత, ఇతర సాంకేతిక సమస్యలతో తపాలా కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల నిర్వహణ మూలనపడింది. ఈ నేపథ్యాన కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తపాలా శాఖ ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఆధార్ కేంద్రాలను నిర్వహించేందుకు నిర్ణయించింది. దీంతో మూతపడిన ఆధార్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం ద్వారా మారుమూల ప్రజలకు తిరిగి సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఖమ్మం డివిజన్ పరిధిలో గతంలో తపాలా కార్యాలయాల్లో నిర్వహించే ఆధార్ కేంద్రాలను ఇప్పుడు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నిర్వహించాలనే ఉత్తర్వులు వెలువడగా... 16 కేంద్రాలను మూడు విడతల్లో ప్రారంభించేందుకు కసరత్తు మొదలుపెట్టారు.

దఫాలుగా కేంద్రాల ఏర్పాటు

ఖమ్మం తపాలా డివిజన్ పరిధిలో కేటాయించిన మొత్తం 16 ఆధార్ కేంద్రాలను రెండు నుంచి మూడు విడతల్లో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. ప్రైవేట్ ఏజెన్సీలు సిద్ధంగా ఉన్న ఆరు పోస్టాఫీసుల్లో మొదటి విడతగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. మిగతావి రెండు లేదా మూడు దశల్లో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా ఖమ్మం జెడ్పీ(పాత కలెక్టరేట్)లోని తపాలా కార్యాలయం, గాంధీచౌక్ తపాలా కార్యాలయంలోని ఆధార్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు.

ఎక్కడెక్కడంటే...

మొదటి దఫాగా ఖమ్మం పాత కలెక్టర్‌లోని తపాలా కార్యాలయం, కొత్తగూడెంలోని హెడ్ పోస్టాఫీస్, ఖమ్మం గాంధీచౌక్, మణుగూరు, ఇల్లెందు, చర్లలోని సబ్ పోస్టాఫీసుల్లో ఆధార్ సేవలు ప్రారంభిస్తారు. ఇక రెండు, మూడో దశల్లో ఖమ్మం హెడ్ పోస్టాఫీస్‌తో పాటు అశ్వారావుపేట, భద్రాచలం, బూర్గంపాడు, మధిర, నేలకొండపల్లి, పాల్వంచ, సత్తుపల్లి, వైరా, ఎర్రుపాలెం సబ్ పోస్టాఫీసుల్లో ఈ సేవలు మొదలవుతాయి.

ప్రజల సౌకర్యం కోసమే...



తపాలా కార్యాలయాల్లో నిలిచిపోయిన ఆధార్ సేవలను తిరిగి అందుబాటులోకి తీసుకొస్తున్నాం. అన్ని ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ఆధార్ సేవలను, కేంద్రాలను నిర్వహిస్తోంది. ఖమ్మం పోస్టల్ డివిజన్‌లో మొత్తం 16 తపాలా కార్యాలయాల్లో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఆధార్ సేవలు అందిస్తాం.
– బి.రవికుమార్, సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

కాంగ్రెస్ కంచుకోట అని నిరూపిద్దాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య, పక్కన సంభాని, దుర్గాప్రసాద్ తదితరులు

- ఖమ్మంలో వచ్చే నెలలో పీపుల్స్ మార్చ్ ముగింపు సభ
- ఎమ్మెల్యే వీరయ్య, మాజీ మంత్రి సంభాని వెల్లడి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ కంచుకోట అని మరోమారు నిరూపించేలా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్ర ముగింపు సభను ఖమ్మంలో భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య వెల్లడించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. జూన్ 10 నుండి 15వ తేదీ మధ్యలో భట్టి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఖమ్మం జిల్లాకు చేరుకుంటుందని తెలిపారు. ఈమేరకు యాత్ర ముగింపు సభ భారీగా నిర్వహించనుండగా ఏఐసీసీ, టీపీసీసీ అగ్రనేతలు హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయడం ద్వారా కాంగ్రెస్ సత్తా చాటాలని వారు కోరారు.

సన్నాహక సమావేశం

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క నిర్వహిస్తున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర వచ్చేనెల జిల్లాకు చేరుకోనున్న నేపథ్యాన నాయకులు సమావేశమై చర్చించారు. మాజీ మంత్రి సంభాని, భద్రాచలం ఎమ్మెల్యే వీరయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొనగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర స్ఫూర్తితో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ జిల్లా నుండి మొదలుపెట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఇప్పటివరకు సుమారు 900 కిలోమీటర్ల మేర పూర్తయిందని చెప్పారు. వచ్చేనెలలో జిల్లాకు చేరుకునే యాత్రతో పాటు ముగింపు సభ విజయవంతంపై నాయకులు ఇప్పటినుంచే దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యులు మహ్మద్ జావేద్, రాయల నాగేశ్వరావు, పుచ్చకాయల వీరభద్రం, వడ్డె నారాయణరావు, నాయకులు నాగండ్ల దీపక్ చౌదరి, రాందాస్, మనోహర్ రెడ్డి, దొబ్బల సౌజన్య, యడ్లపల్లి సంతోష్ పాల్గొన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన దుర్గాప్రసాద్‌ను నాయకులు సన్మానించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఖరీదైన వైద్యం

ఖమ్మంలో ఇద్దరి ప్రాణాలు కాపాడిన వైద్యుడు



కోలుకున్న సతీష్‌తో మాట్లాడుతున్న సూపరింటెండెంట్, న్యూరాలజిస్ట్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఖరీదైన వైద్యం ఉచితంగా అందడతో ఇద్దరి ప్రాణాలను కాపాడినట్లయింది. ప్రైవేట్‌లో వైద్యం చేయించుకునే స్థోమత లేక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఇద్దరికి న్యూరాలజిస్ట్ చైతన్య వైద్యసేవలు అందించి ప్రాణాలు నిలిపాడు. ఈమేరకు వివరాలను ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, న్యూరాలజిస్ట్ చైతన్య గురువారం వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన జె.సతీష్ ఈ నెల 10న, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం తిప్పరపల్లికి చెందిన కె.శ్రీను ఈనెల 14న ఆస్పత్రిలో చేరారు. వీరిద్దరికి గులియన్ బేరీ సిండ్రోమ్ వ్యాధి ఉండగా.. ఒక్కసారిగా జ్వరం తీవ్రంగా వచ్చి అది నరాలకు వ్యాపించి ఆపై కాళ్లు, చేతులు చచ్చుబడి శ్వాస తీసుకోవటం ఇబ్బందిగా మారుతుంది. అంతేకాక మరణానికి దారితీసే ఈ వ్యాధి అరుదుగా వస్తుందని తెలిపారు. వీరిద్దరు హైదరాబాద్, ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లగా ఖరీదైన చికిత్స కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి రాగా చికిత్స ప్రారంభించినట్లు చెప్పారు. హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా ఇమ్యూనో గ్లోబిలిన్ ఇంజక్షన్లు తెప్పించి చికిత్స చేయడంతో వారు కోలుకున్నారని తెలిపారు. ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.20 వేల వరకు ఉండగా, ఒక్కొక్కరికి ఇరవై సార్లకు పైగా ఇచ్చినట్లు చెప్పారు. ఈ వైద్యానికి ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.5 లక్షల నుండి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. చికిత్స చేసిన డాక్టర్ చైతన్య, సిబ్బందిని సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అభినందించగా, తమ ప్రాణాలు కాపాడిన వైద్యుడికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఐడియా అదుర్స్ !



వైరారూరల్: ఎండలు మండిపోతుండడంతో ప్రజలు ఉపశమనం కోసం రకరకాల మార్గాలు అన్వేషిస్తున్నారు. వైరా మండలం వల్లాపురానికి చెందిన చిరువ్యాపారి కసిమల్ల నారాయణ ఉక్కపోత భరించలేక, కూలర్ కొనుగోలు చేసే స్థోమత లేక వినూత్న ఆలోచన చేశాడు. గ్లూకోజ్ డబ్బాలో నీరు పోసి షట్టర్‌కు కట్టి పైపును టేబుల్ ఫ్యాన్‌పై కర్ర సాయంతో అమర్చాడు. గ్లూకోజ్ పైపు నుండి కారుతున్న నీరు ఫ్యాన్ స్పీడ్‌కు చిరుజల్లులుగా చిమ్ముతోంది. దీంతో వస్తున్న చల్లటి గాలికి ఉక్కపోత నుండి ఉపశమనం పొందుతున్నాడు.

ఎంపీ నామ కృషితో పేదలకు లబ్ధి

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం నామ నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో పేదలకు సీఎంఆర్ఎఫ్ సాయం అందుతోందని రైతుబంధు సమితి ఖమ్మం జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు చెందిన 66 మందికి రూ.21,32,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. ఎంపీ కృషితో నాలుగేళ్లలో రూ.50 కోట్లకు పైగానే పేదలకు ఆర్థిక సాయం అందిందని తెలిపారు. పార్టీలను చూడకుండా అర్హత కలిగిన వారందరికీ సాయం అందేలా ఎంపీ సిఫారసు చేస్తున్నారని చెప్పారు. కాగా, సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు సాయం అందిస్తున్న సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చేసేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకమేడల సత్యనారాయణ, పోట్ల శ్రీను, తన్నీరు రవి, గోడ్డేటి మాధవరావు, చిత్తారు సింహాద్రియాదవ్, ఉప్పునూతల నాగేశ్వరరావు, చింతలచెర్వు లక్ష్మి, బత్తుల శ్రీనివాసరావు, కొనకంచి వెంకటేశ్వర్లు, పాల్వంచ రాజేశ్, చీకటి రాంబాబు, కృష్ణప్రసాద్, భార్గవ్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు